## ఆడపిల్లలను రక్షించండి.. చదివించండి

విశాలాంధ్ర - ఆనందపురం: పాలవలస అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కల్పిస్తూ కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలవలస ఎంపీటీసీ రౌతు శ్యామల పాల్గొని మాట్లాడుతూ బాలల హక్కులు చట్టాలపై వివరించారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కళాజాతలో విజయవాడ గుడివాడ ఆల్ ఇండియా రేడియో టీవీ ఆర్టిస్టుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎడవల్లి దుర్గారావు సుంకర రాజు పాల్గొని మాట్లాడుతూ బాలికల సంరక్షణ సంరక్షణకు భీమిలి నియోజకవర్గంలో 144 కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పద్మావతి, కుమారి, పాలవలస గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

### ఎమ్మెల్యే పల్లా శ్రీనుకు వినతి

విశాలాంధ్ర - గాజువాక: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించాలని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినందుకు ధన్యవాదములు తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఆధ్వర్యంలో అందజేశారు. సోమవారం విశాఖ జిల్లాలో గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావుకు అసోసియేషన్ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. చంద్రబాబు నాయుడు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులను పెద్దమొత్తంలో అటాచ్మెంట్ చేయించటం, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇప్పించటంతోపాటు ఎన్నోరకాలు సాయం చేసేందుకు ప్రయత్నించి వున్నారని, జగన్ ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించడంతోపాటు అన్ని సమస్యలను ఆరు మాసాలలో పరిష్కరిస్తామని చెప్పి మోసగించారని, 20 వేల రూపాయలలోపు వున్నవారికి కొంత డబ్బు చెల్లించి మమ అనిపించారన్నారు. అగ్రిగోల్డ్‌లో సుమారు పదిన్నర లక్షల కుటుంబాలకు ఇంకా రూ.3080 కోట్లు రావల్సి ఉందని, కంపెనీకి వున్న వేలాది కోట్ల ఆస్తులు జప్తు చేసి వుండటమే కాక మరికొన్ని వేలకోట్లు బినామీ ఆస్తులుగా యాజమాన్యం చేతిలో ఉన్నాయని,

అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించుటలో సమర్థ అధికారులతో స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయించి సత్వర పరిష్కారానికి కృషి చేయించాలని, రాష్ట్ర వ్యాపితంగా వున్న అగ్రిగోల్డ్ ఆస్తులు అన్నింటిని సంరక్షించుటకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అటాచ్మెంట్ చేసిన ఆస్తుల న్నింటినీ కోర్టులో చేయించుటకు న్యాయాధికారులకు తగిన ఆదేశాలు ఇప్పించాలని, కంపెనీ యజమానుల పేరుతో ఉన్న బినామీ ఆస్తులు, పలు రకాలుగా యాజమాన్యం దాచుకున్న బినామీ ఆస్తులను స్వాధీన పరచుకోవాలని,ఇళ్ళస్థలాలు, వ్యవసాయ భూములు ఆయా స్కీములలో కొన్న వారికి న్యాయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎన్.మధుసూదన్‌రావు, నాయకులు కే.మంగరాజు, ఎస్.గణేష్ రావు, జి.రమణ, ఏ.నరసింహం, ఎస్.సురేష్, బి.గుప్తా, బి.సంతోష్ అమ్మ, బిహెచ్‌పివి ఆదినారాయణ, ఈ.రాము తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి శంకర్ పౌండేషన్ ఘన స్వాగతం

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు నాయుడుతోట శంకర్ పౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కే.బంగార్రాజు ఘన స్వాగతం పలికారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా విశాఖపట్నం విచ్చేసిన మంత్రిని విమానాశ్రయంలో కలిసిన బంగార్రాజు శాలువాతో సత్కరించి పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సాధించిన ప్రగతి, సమాజానికి నిర్విరామంగా చేస్తున్న ఉచిత కంటి సేవలు గురించి మంత్రికి వివరించి, ఆసుపత్రిని సందర్శించవలసినదిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వార్షిక రిపోర్టును మంత్రికి అందచేశారు. మంత్రి వెంట ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఉన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - మల్కాపురం: హెచ్‌పీసీఎల్ సంస్థ, ధాన్ ఫౌండేషన్ మల్కాపురం కళంజియ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కాకర్లోవ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్, గైనిక్, ఆర్థో, కంటి, డెంటల్‌కు సంబంధించిన వైద్యులు మెడికవర్ ఆసుపత్రి నుండి హాజరై వైద్య పరీక్షలు చేశారు. 300 మంది వైద్య సేవలను పొందారు. ఈ శిబిరాన్ని హెచ్‌పీసీఎల్ సీజీఎం ఛటర్జీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ కాళి, దాన్ ఫౌండేషన్ మల్కాపురం కళంజియ సమాఖ్య కో ఆర్డినేటర్ సుభాషిణి, అకౌంటెంట్ కృష్ణవేణి, సమాఖ్య నాయకులు హురున్నిషాబేగం, పార్వతి పాల్గొన్నారు.

## నేతల చిత్రపటాలు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బంటుపల్లి వారి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఎన్డీఏ కూటమి నాయకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోన పైడ్రాజు శ్రీను, కార్యదర్శి ప్రసాద్, కూటమి నాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు, బుజ్జీ, ఆర్.నాగరాజు, నరసింగరావు, మీసాల శ్రీను, సత్తిబాబు, సంతోష్, శ్రీను, అప్పలరాజు, సురేష్, సూర్యనారాయణ, ఉపేంద్ర నాయుడు, వంశీ, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలోని కణమాం పంచాయతీ పరిధిలో యాతకణమాంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు స్థానికులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నెంబర్ 50లో జగనన్న కాలనీకి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలును ఆపాలని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణదారులకు తగు హెచ్చరికలు జారీ చేయాలని ప్రభుత్వ స్థలంలో కన్నారావు, రవీంద్రబాబులు ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడాలు చేపడుతున్నట్లు ఈ విషయంపై స్థానిక రెవెన్యూ అధికారులకు చెప్పినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని ఆ గ్రామానికి చెందిన చందవరపు ప్రకాష్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కలెక్టరును కలిసిన సీపీఐ బృందం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా కలెక్టరుగా ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం సీపీఐ ప్రతినిధి బృందం కలిసి అభినందనలు తెలిపింది. కలెక్టర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె రెహమాన్, పి.చంద్రశేఖర్ తదితరులు సోమవారం కలెక్టరేట్‌లోని వారి ఛాంబర్‌లో కలిసి సీపీఐ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిస్కారానికి సీపీఐ తరుపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాలో అన్యాక్రాంతమౌతున్న విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుండి కాపాడాలని కోరారు. జిల్లా కలెక్టరును కలిసిన వారిలో సీపీఐ నాయకులు జెడి నాయుడు, సీహెచ్ కాసుబాబు తదితరులు ఉన్నారు.

## సెంట్రల్ ఫార్మసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కలక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ ఫార్మసీ యాజమాన్యం కార్మికులపై లైంగిక వేధింపులకు గురి చేస్తుందని, జీత భత్యాల చెల్లింపు విషయంలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతుందని బాధితులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళారు. ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల రమణ నేతృత్వంలో స్పందన కార్యక్రమంలో యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ ఫార్మసీలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులపై అక్రమ కార్యకలాపాలు, ప్లేస్మెంటు పేరుతో ఒక విద్యా సంస్థతో లావాదేవీలు నడుపుతూ కార్మికుల సెంట్రల్ ఫార్మసీ యాజమాన్యం శారదా, బి.నర్సింహ మూర్తి వారి కుమారులు గౌతమ్, గణేష్లు శ్రమ దోపిడీతో పాటు అక్రమ కార్యకలాపాలు లైంగిక వేధింపులు జరుపుతున్నారని తెలిపారు. ప్లేస్మెంటు అని చెప్పి సెంట్రల్ ఫార్మసీవారు వీర లైఫ్కేర్ సర్వీసెస్ ప్రైవేటు లి. సిన్-యు ఏజన్సీ ద్వారా విద్యా సంస్థతో కుమ్మక్కయి వారి సర్టిఫికేట్లను తీసుకుని కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. 12 గంటలు పని అని చెప్పి 13 నుండి 14 గంటలు పని చేయించుకుంటున్నారన్నారు. మానేస్తామని చెపితే 4 మాసాల జీతాలు కూడా ఇవ్వడం లేదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సెంట్రల్ ఫార్మసీ కార్మికులు మురళీకృష్ణ, హరీష్, దిలీప్, సంధ్య, సంజన, కృపా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించి ప్రగతిని సాధించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగ మించి, ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి, పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు కారుణ్య నియామకాలపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టర్ జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షే మ శాఖ వసతి గృహాల్లో కొన్ని చోట్ల తాగునీరు, మురుగునీటి సమస్య ఉం దని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డీడీ, సోషల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. నిత్యా వసర సరుకులను సకాలంలో విడిపించి, మండల స్థాయి నిల్వ కేంద్రాల్లో ఉంచాలని, రిజిస్టర్ ప్రకారం అన్ని సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి పంపిణీ చేయాలని జిల్లా సరఫరా అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పి.ఎమ్ విశ్వకర్మ యోజన పథకానికి భారీగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### ఖాళీల వివరాలు అందజేయండి

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకాల కొరకు సుమారు 80 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని భర్తీ చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను నిర్దిష్ట పట్టిక ద్వారా తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీఓ డి.హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల జీవన భృతికి గండి కొట్టొద్దు

విశాలాంధ్ర - విశాఖ: ఆటో డ్రైవర్ల జీవన భృతికి గండి కొట్టే ఓలా, ఊబర్, రాపిడోలను నిలిపివేయాలని ఆటో యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న ఆటో డ్రైవర్లు ఓలా, ఊబర్, రాపిడోల వల్ల బేరాలు తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. పలు డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ఆటోల ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థలు ఆటోలను ఎంగేజ్ చేసుకొని వారి యాప్‌ల ద్వారా డ్రైవర్లకు మెసేజ్ పంపించి బేరానికి ప్రయాణికుడి నుంచి వసూలు చేసేవారని తెలిపారు. అప్పుడు ఆ బేరంతో పాటు ఆ సంస్థ నుండి అదనంగా అయిదు నుండి పది రూపాయలు కలిపేవారన్నారు. ఇప్పుడు ఆ సంస్థల యాప్ నుండి డ్రైవర్‌కి మెసేజ్ వచ్చి బేరం కడితే డ్రైవర్ నుండి 20 రూపాయలు వసూలు చేస్తూ బేరాన్ని బట్టి అదనంగా ఛార్జీలు కూడా వసూలు చేస్తున్నారని చెప్పారు. దీని వల్ల ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా నష్టం జరుగుతోందని, ఆటో డ్రైవర్ల జీవన భృతికి గండిపడుతోందని అన్నారు. రాపిడో.. టూ వీలర్ మీద ఓన్ బోర్డ్ అయ్యి ఉండి బైక్ మీద కస్టమర్లను తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని అన్నారు. టూ వీలర్‌ను ఎంగేజ్ చేసుకున్న రాపిడో సంస్థపై చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఒక యాప్ ఏర్పాటు చేసి ఆ యాప్ నుండి నేరుగా డ్రైవర్‌కి సందేశం వచ్చి, కస్టమర్‌ని డ్రైవర్ తీసుకెళ్లే విధంగా ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో బేరాలు లేక ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతూ ఆటో ఫైనాన్స్, పెరిగిన కరెంట్ ఛార్జీలు, పిల్లలు స్కూల్ ఫీజులు, ఇంటి అవసరాలు, సకాలంలో తీర్చుకోలేక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లపై ఆర్టీఏ అధికారులు, పోలీసులు కేసులు పెడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 21ని ఇంప్లిమెంట్ చేసి అధిక జరిమానాలు విధిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో తీసుకొచ్చిన జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని, రోజువారీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని నగరంలో అన్ని ప్రాంతాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఇవ్వాలని, ఇప్పటికే పెరిగిన ఆర్టీఏ చలానా ఛార్జీలు తగ్గించాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు పెడుతున్న కేసులను ఎత్తివేయాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ హరేంధ్ర ప్రసాద్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె అచ్యుతరావు, అధ్యక్షులు ఎం.మన్మధరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సాయికుమార్, పోల్ రెడ్డి, దుర్గా, శివ, సీఎం రమణ, కోచ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి

### ప్రపంచంలోనే మంచి విద్యావ్యవస్థగా కేజీహెచ్ రూపుదిద్దుకోవాలి

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సమాజంలో అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి చాలా గొప్పదని, అటువంటి వృత్తిని సేవా దృక్పథంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్య ప్రసాద్ వైద్యులకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కె.జీ.హెచ్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 179 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన కేజీహెచ్ ప్రపంచానికే ఆదర్శమయ్యేలా తీర్చిదిద్దాలని, ఆ దిశగా అందరూ సమిష్టి కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గ్రామ స్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్స్, పిహెచ్సీలు, సీహెచ్సీలు, యుహెచ్సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గుచూపుతున్నారని, ఆ భావన ప్రజల్లో పోయి ప్రభుత్వ ఆసుపత్రులకి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, ఆధునిక పరికరాలు, సరైన సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. వైద్యులు సేవగా భావించి ఈ వృత్తిలోకి వచ్చారని, అదే స్ఫూర్తితో పనిచేయాలని గుర్తుచేశారు. అలాగే ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారాలు అందిస్తామని తెలిపారు. అదృష్టవశాత్తు దేశంలో, రాష్ట్రంలో గొప్ప దార్శనీకుడైన, విజన్ ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి మనకు ఉన్నారని కొనియాడారు. వారి ఆలోచనల మేరకు రాష్ట్రంలో 5 కోట్ల 30 లక్షల మందికి బ్రెస్ట్, సర్వేకల్ కేన్సర్ వంటి స్క్రీనింగ్ టెస్టులకు ప్రణాళిక చేయబోతున్నామని అన్నారు. 68 లక్షల మందికి ఆరోగ్య శ్రీ ద్వారా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించబోతున్నామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో కొత్తగా 12 వైద్య కళాశాలలు నిర్మించబోతున్నామని, ఇందుకు అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ నిధులు సమీకరణ కోసం ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ కేజీహెచ్ వైద్యుల వద్దకు ఎంతోమంది రోగులు వస్తుంటారని, కావున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కొత్త నిర్మాణాల విషయంలో నిధులు దృష్ట్యా ఎత్తయిన కట్టడాలు జరగడం

లేదన్నారు. ఇకపై నిర్మాణాలు చేపడితే రానున్న 50 ఏళ్ళను దృష్టిలో ఉంచుకొని, జీ ప్లస్ 20 తరహాలో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధ్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా నుంచి వచ్చే రోగులకు కూడా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఉందని, అయితే దాని సేవలు మరింత పటిష్టపరచి విస్తృతం చేస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, ఉత్తర శాసనసభ్యులు పి.విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి కలిగిన ఆసుపత్రి కేజీహెచ్ అని, ఎక్కడా వైద్యం అందని స్థితిలో ఈ ఆసుపత్రికి తరలిస్తారని, ఇక్కడ వైద్యులపై ఉండే నమ్మకం అమోఘమని కొనియాడారు. కెజీహెచ్ సూపరింటెండెంట్ డా. పి.శివానంద్, ఎఎంసి ప్రిన్సిపాల్ డా. బుచ్చిరాజు, డిఎంహెచ్ఓ డా. పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ కేజీహెచ్, ఆంధ్రా వైద్య కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల నివేదికలను మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఎస్.కోట శాసనసభ్యులు కె.లలితకుమారి, పి.గోవిందరావు, గండి బాబ్జి, సుధాకర్ సీతారామ్, సీనియర్ సర్జన్లు, బోధన, బోధనేతర సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌సైడ్ ట్రేడింగ్ దొంగలను ఉపేక్షించవద్దు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అసైన్డ్ భూములు ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడిన దోషులను వదిలే ప్రసక్తే లేదని అవకాశం ఇస్తే నేరుగా ముఖ్యమంత్రిని కలసి ఎస్సి రైతులకు మార్కెట్ తెస్తామని విదసం నేతలు స్పష్టం చేశారు. సోమవారం గ్రీవెన్స్‌లో విశాఖ కలెక్టరు ద్వారా అసైన్డ్ భూములపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ విశాఖలో అసైన్డ్ భూములు ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కి పాల్పడిన దోషులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీలను మోసగించడం , అధికార రహస్యాలు వెల్లడి, నిషేధ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి భూ బదలాయింపు నిలుపుదల చేయాలని, అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాల నివారణ కోసం తక్షణమే జీఓ సవరించాలని ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి గ్రెవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జాజి ఓంకార్, బూల భాస్కరరావు, కస్తూరీ వెంకటరావు, రవి శేఖర్, రవి సంతోష్, అఖిల్, మొయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరిస్తాం: సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతన పరిష్కరిస్తామని జిల్లా పోలీస్ కమిషనర్ శంఖబ్రాత భాగ్చి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుండి వచ్చిన 110 మంది ఫిర్యాదిదారులు వారి సమస్యలను జిల్లా సీపీకి స్వయంగా విన్నవించుకున్నారు. సీపీ వారి సమస్యలను విని, అర్జీలను పరిశీలించి, చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. సీపీ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ప్రజలు స్వయంగా వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియ జేయవచ్చునని తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు జాయింట్ కమీషనర్ ఆఫ్ డా. కే.ఫక్కీరప్ప, నగర సబ్-డివిజన్ ఏ.సి.పిలు, పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ అవార్డుల దరఖాస్తులకు గడువు పొడిగింపు

### - జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జాతీయ అవార్డులు-2024 కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీని పొడిగిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వెబ్ పోర్టల్‌లో ఆన్లైన్ ద్వారా సెల్ఫ్ నామినేషన్ చేసుకొనుటకు గాను ఈనెల 18వ తేదీ వరకు గడువును పొడిగిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పూర్తిస్థాయిలో సమర్పించడానికి ఆఖరు తేదీ 21.7.2024 అని తెలిపారు. స్వయంగా దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 21వ తేదీ లోపల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కొరకు http:nationalaward-stoteacher.education. వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయునికి కనీసం 10 సంవత్సరముల సర్వీసు ఉండాలన్నారు. ఇదివరలో జిల్లాస్థాయి, మండల స్థాయి ఉపాధ్యాయ అవార్డులు పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు అవార్డులకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే విధంగా ప్రతిపాదనలు పంపించాలన్నారు.

## రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి అందించారు. పెదగంట్యాడ ఆల్ రిటైర్డ్ పెన్షనర్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. మినిమం పెన్షన్ 9000 ఇవ్వాలని, రైస్ కార్డు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, ట్రైన్ చార్జీ రాయితీ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు వర్మ, జిల్లా టీడిపి నాయకులు పులి రమణారెడ్డి, జిల్లా నాయకులు కే.దీనబంధు హుస్సేన్, కనితి అప్పలరాజు, పిట్ట గుర్నాథ్, నమ్మి కుమార్, కె.వి.రమణ, నమ్మి అప్పల నాయుడు, నమ్మి అప్పారావు, కే.పెంటారావు, ములగల పిల్లి పెంటారావు, ఎన్వి రమణ, సన్యాసిరావు, వెంకట్రావు, సోమి నాయుడు, పిట్ట పించే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 1912కు ఫోన్ చేసి వ్యవసాయ కనెక్షన్ పొందండి

## ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావలసినవారు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి సర్వీసు పొందవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం కాల్ సెంటర్ 1912కు ఫోన్ చేయడం ద్వారా పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ-సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతో ందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్లోడ్ చేసేటప్పుడు రైతులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను దృష్టిలో పెట్టుకొని రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్ నంబర్ 1912కు ఫోన్ చేస్తే కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ను పొందే నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి 1912కు ఫోన్ చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్, పట్టాదార్ పాస్ బుక్ నంబర్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికేట్ నంబర్, కుల ధృవీకరణ పత్రం (ఎస్సీ/ ఎస్టీ వినియోగదారులకు వర్తిస్తుంది) వంటి వివరాలను తెలియజేయాలన్నారు. వినియోగదారులు మెరుగైన, నాణ్యమైన సేవలను పారద ర్శకంగా పొందడానికి ఇకనుంచి గ్రామ/వార్డు సచివాలయాలు, మీ- సేవ కార్యాలయాలను సందర్శించడం కానీ, ఎవరినీ ఆశ్రయించవలసిన అవసరం కానీ లేదని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ సేవల కోసం 1912కి నేరుగా సంప్రదించి సేవలను పొందవచ్చని, నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని సంస్థ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావలసిన రైతులందరూ వినియోగించుకోవాలని సీఎండీ పృథ్వీతేజ్ విజ్ఞప్తి చేశారు.

# మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలి: మూర్తి యాదవ్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ రూపొందించిన 2041 మాస్టర్ ప్లాన్ ఎంపీ విజయ సాయిరెడ్డి కనుసన్నల్లో తయారైందని దాన్ని వెంటనే రద్దు చేయాలని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో సోమవారం ఈ మేరకు మెట్రోపాలిటన్ కమిషనర్ వి.రవీంద్రకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విఎంఆర్డిఏ 2041 మాస్టర్ ప్లాన్ పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం విశాఖలో చేసిన అతి పెద్ద కుంభకోణాల్లో ఇదొకటని అన్నారు. విజయసాయి బృందం అవినీతి, అక్రమాలు, కబ్జాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ని రూపొందిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మాస్టర్ ప్లాన్ప పై 9,300 అభ్యంతరాలు వచ్చాయన్నారు. బీచ్ రోడ్‌లో ఐఎన్ఎస్ కళింగ దాటిన తర్వాత ప్రతిపాదిత 200 అడుగుల రోడ్డు అష్టవంకరలు తిరగటం వెనుక విజయ సాయి రెడ్డి బృందం భూ వ్యవహారాలు ఉన్నాయని విమర్శించారు. మాస్టర్ ప్లాన్ అమలు జరిగితే విశాఖ రీజియన్ పరిధిలోని లక్షల మంది భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందన్నారు. సింగపూర్, మలేషియా వంటి దేశాలు రద్దీగా ఉండే పాత టౌన్ లలో రహదార్ల విస్తరణకు వెళ్ళటం లేదన్నారు. అందుకు విరుద్ధంగా ప్రజల కంటే, వారి జీవనం కంటే 200 అడుగుల వెడల్పు రోడ్ లే ముఖ్యమైనట్లు ప్లాన్ రూపొందించడం ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. లక్షలు, కోట్ల రూపాయల విలువైన భూములను మాస్టర్ ప్లాన్ కారణంగా అభివృద్ధి చేసుకోలేని నిస్సహాయ స్థితిలోకి ప్రజలు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. గతంలో విఎంఆర్‌డిఏ అనుమతించిన 300 లకు పైగా లే అవుట్ లలో ప్లాట్ లు, వందల ఏళ్లుగా ఉన్న కొన్ని గ్రామాలు మాస్టర్ ప్లాన్ కారణంగా అంతర్ధానం కానున్నాయన్నారు. మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా వైసిపి నేతల ఆస్తులు కూడగట్టుకునే ప్లాన్ గా తయారు చేశారని విమర్శించారు. వైసీపీ నేతలకు భూములు ఇవ్వడానికి అంగీకరించిన వారు, డబ్బులు ఇవ్వడానికి ముందుకు వచ్చిన వారి దగ్గర ప్లాన్ రోడ్డు లను మార్చి నిరాకరించిన వారిని ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. మాజీ ఎంపీ ఎంవీవీకి టిడిఆర్ ఇచ్చేందుకు, దసపల్లా భూములు టీడిఆర్ కోసం 100 అడుగుల రోడ్డు, సన్ రే రిసార్ట్స్ అనుకూలంగా మాస్టర్ ప్లాన్ రోడ్డులను ప్రతిపాదించారని చెప్పారు. వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రతిపాదనను మార్పులను వెంటనే రద్దు చేయాలని కోరారు. విశాఖ ప్రాంత ప్రజల భవిష్యత్తు కోసం సరికొత్త మాస్టర్ ప్లాన్ తయారు చెయ్యాలన్నారు.

# కార్మికుడి కుటుంబానికి అండగా ఏఈసిఈఏ (జీ-3045) సభ్యులు

విశాలాంధ్ర - పెందుర్తి: గోపాలపట్నం సబ్ డివిజన్ పరిధిలోని, గోపాలపట్నం సెక్షన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తూ దురదృష్టవశాత్తు అకాల మరణం చెందిన ఎస్. ౦కరావు కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (జి-3045) అండగా నిలిచింది. కుటుంబ పెద్ద అకాల మరణం చెందడంతో కష్టాలెదుర్కొంటున్న ఆ కుటుంబానికి యూనియన్ విశాఖపట్నం జిల్లా జోన్ 3 కార్మికుల తరఫున రూ.75 వేలు మొత్తాన్ని అందచేసి మానవత్వం ప్రదర్శించింది. జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాస్ చేతుల మీదుగా శంకర్రావు కుటుంబసభ్యులకు నగదును అందచేసారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులందరూ ఐకమత్యంగా సాగుతూ, ప్రమాదాలు జరగకుండా విధుల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు గొంతు రామకృష్ణ, స్టేట్ కో ఆర్డినేటర్ కంచిపాటి జగదీష్ కుమార్, జోన్-3 నాయకులు ఆదారి వాసు, సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న తోటి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. కార్మికుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఒకరికొకరు తోడుగా సంఘాన్ని ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. శంకర్రావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. శంకర్రావు కుటుంబానికి సాయమందించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గుడివాడ అమరనాథ్, అతని అనుచరుడిపై చర్యలు తీసుకోవాలి

## - సీపీని కలిసిన తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అతని అనుచరునిపై చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు డివి రామ్ అన్నారు. సోమవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని పోలీస్ కమిషనరేట్‌లో కలిసి వినతి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఉత్తరాంధ్రపై సవితి ప్రేమ చూపిస్తున్నారంటూ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ చెప్పడం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతంలో పెట్టుబడి పెట్టేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసిన గుడివాడ అమర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అరాచకాలపై తెలుగు శక్తి అనేక విధాలుగా ప్రశ్నించింది అన్నారు. ఈ నేపథ్యంలోనే తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని పోలీస్ కమిషనర్‌కు తెలియజేశారు. తనకు ఫోన్ చేసి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై ఫిర్యాదు చేస్తే ఇంతవరకు స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన వాహనానికి నష్టం కలిగించారని దానిపైన చర్యలు లేవన్నారు. గుడివాడ అమర్ అనుచరుడైన కుమార్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి చంపుతానని బెదిరించేవాడని, అతని బెదిరింపుల కాల్ రికార్డింగ్స్ పోలీసులకు గతంలోనే అందజేశానన్నారు. మరోవైపు అప్పటి జిల్లా కలెక్టర్, హోం మంత్రికి ఇదే విషయం ఫిర్యాదు చేశానన్నారు. హోం మంత్రి చర్యలు తీసుకోవాలని స్వయంగా పోలీస్ కమిషనర్‌కి లిఖితపూర్వకంగా తెలియజేసినప్పటికీ స్పందన లేదన్నారు. ఇప్పటికైనా విజ్ఞాపనకు స్పందించి అమరనాథ్, అతని అనుచరుడు కుమార్‌పై చర్యలు తీసుకోవాలి కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డాక్టర్ పాపూర్ నికుంచ్, ఆడారి ఉమాశంకర్, సంధిరెడ్డి మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌కు అధికారులు తప్పక హాజరుకావాలి

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 261 వినతులు

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీదారుల సమస్యలపై జవాబుదారీతనంతో స్పందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఫిర్యాదుపై అధికారులు తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని సూచించారు. పీజీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని, దీనికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తేల్చి చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు జిల్లా కేంద్రం విడిచి వెళ్ళవలసి వస్తే ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆయన స్థానంలో హాజరయ్యే అధికారులు సంపూర్ణ సమాచారం, అవగాహనతో పీజీఆర్ఎస్ కు హాజరుకావాలని కలెక్టర్ హితవు పలికారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి, సంబంధిత శాఖాధికారులకు సిఫార్సు చేశారు. అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అధికారులను ఉద్దేశించి పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. ఆయా విభాగాల జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడాలని, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత విభాగాల పరిధిలో నమోదైన ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించి, అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. నిర్దీత సమయంలోగా అర్జీదారుని సమస్యకు న్యాయమైన పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్,ఏసీపీ టీ.ఎస్.ఆర్.కె.ప్రసాద్ భాగస్వాములై అర్జీదారుల నుంచి పలు వినతులను స్వీకరించారు. కాగా అన్ని విభాగాల జిల్లాస్థాయి అధికారులు, ఇతర అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సమస్యల పరిష్కార వేదికకు 261 వినతులు

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 261 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 104 ఉండగా, జీవీఎంసీకి చెందినవి 77 ఉన్నాయి. అలాగే పోలీసు శాఖకు సంబంధించి 09 వినతులు రాగా, ఇతర విభాగాలకు సంబంధించి 71 వచ్చాయి.

# యువత నైపుణ్యాలు పెంచుకోవాలి: జేడీఎం

విశాలాంధ్ర - పెందుర్తి: యువత నైపుణ్యాలు పెంచుకోవాలని జిల్లా జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (జేడీఎం) కళ్యాణి సూచించారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా కైట్స్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైపుణ్య దినోత్సవ కార్యక్రమం సోమవారం పెందుర్తిలోని తాండ్ర పాపారాయ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేడీఎం కళ్యాణి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు, వివిధ రంగాలకు అవసరమయ్యే నైపుణ్యాలను యువత నేర్చుకోవాలని పేర్కొన్నారు. కైట్ స్కిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గొర్లె రామునాయుడు మాట్లాడుతూ 2014లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జూలై 15న ఏటా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం జరపాలని ప్రకటించిందని తెలిపారు. స్కిల్ సెంటర్ల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. కైట్స్ డైరెక్టర్ నాదెళ్ల జ్యోతి, హిందీ మంచ్ కన్వీనర్ కోనే శ్రీధర్, పెన్నం రమేష్, తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేసారు. స్కిల్ సెంటర్ల సిబ్బంది సుభాన్, శేషగిరి, సావిత్రి, శిల్ప, సీడాప్ సిబ్బంది మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దుర్గ 'పల్లె మారింది' పాటను ఆలపించగా, దండా జ్యోతి, త్రివేణి బిసాయి, ఉషారాణి, వరాహ లక్ష్మి, శ్యామల, స్మైల్ లక్ష్మి లు స్కిల్ సాంగ్ ఆలపించారు. బాక్సింగ్ లో రాష్ట్రస్థాయి స్వర్ణ పతకాన్ని సాధించి, జాతీయస్థాయి పోటీలో పాల్గొన్న గోపాలపట్నం స్కిల్ సెంటర్ విద్యార్థిని వాళ్ళ జ్యోతి, నృత్యంలో నైపుణ్యం ప్రదర్శించిన పెందుర్తి స్కిల్ సెంటర్ విద్యార్థిని దాసరి దుర్గలను జేడీఎం కళ్యాణి, కైట్స్ ఎండి గొర్లె రామునాయుడు, డైరెక్టర్ నాదెళ్ల జ్యోతిలు జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

## దుర్గాబాయి దేశ్ ముఖ్‌ను

# మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాపురం: స్వాతంత్ర సమరయోధురాలు, సంఘసంస్కర్త, దుర్గాబాయి దేశ్ ముఖ్‌ను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డాక్టర్ దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె ముఖ్య వక్తగా మాట్లాడారు. దుర్గాబాయ్ దేశ్ ముఖ్ చెన్నైలో, హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభను స్థాపించారని, ఆమె భారత రాజ్యాంగ పరిషత్‌లో, ప్రణాళిక సంఘంలో సభ్యురాలిగా పని చేశారని, మహిళల హక్కుల కోసం పోరాడారని అన్నారు. ఆమె తెలుగింటి ఆడపడుచు కావడం గర్వకారణమని అన్నారు. విశాఖ పట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో ఆమె ఎం.ఎ.పొలిటికల్ సైన్స్ చదివారని, చెన్నైలో న్యాయ శాస్త్రాన్ని అభ్యసించారని అన్నారు. పేద మహిళల కోసం ఆమె అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఆంధ్ర మహిళ అనే పత్రికను స్థాపించారని, అనేక వసతి గృహాలు, నర్సింగ్, వృత్తివిద్యా కేంద్రాలు మహిళల కోసం ఏర్పాటు చేశారని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథక సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి, అధ్యాపకులు శ్రీమతి శిరీష, త్రివేణి, సలోమి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాబాయి దేశ్ ముఖ్ పై నిర్వహించిన క్విజ్ లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులను పంపిణీ చేశారు. సమావేశంలో పాల్గొన్న వారందరినీ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు.

# ప్రైమ్ డే అమెజాన్‌లో 3,200 కొత్త ఉత్పత్తులు

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఈ ప్రైమ్ డే సందర్భంగా చిన్న వ్యాపార సంస్థలు అమెజాన్.ఇన్‌లో ఇల్లు మరియు వంటగది, ఫ్యాషన్ , వస్త్రధారణ, నగలు, చేతితో తయారు చేసిన ఉత్పత్తులు మరియు మరెన్నో విభాగాలలో 3200ం కొత్త ఉత్పత్తులను విడుదల చేయనున్నాయి. బెహెరామా, డ్రీమ్ ఆఫ్ గ్లోరీ, ఒరికా స్పైసెస్ మరియు ఇతర బ్రాండ్‌లు అమెజాన్.ఇన్‌లో తమ ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రదర్శిస్తాయి మరియు దేశంలోని వివిధ ప్రాంతాలలోని కస్టమర్‌లను చేరుకోనున్నాయి. భారతదేశం అంతటా ఉన్న కస్టమర్‌లకు లక్షలాది ప్రైమ్-ఎనేబుల్డ్ ఉత్పత్తులను అందించే అమెజాన్.ఇన్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న షాపింగ్ ఈవెంట్‌లలో వేలాది చిన్న వ్యాపార సంస్థలు పాల్గొననున్నాయి. "అమెజాన్ ప్రైమ్ డే అనేది భారతదేశంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న షాపింగ్ ఈవెంట్‌లలో ఒకటి, ఇది మా అమ్మకందారులకు , కస్టమర్‌లకు అసమానమైన విలువను అందించడంలో మాకు సహాయపడుతుంది. మా విక్రేతలు, ముఖ్యంగా చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాల పనితనం , సృజనాత్మకత, ఉత్పత్తి ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక స్ఫూర్తిని వేడుక జరుపుకుంటూ, వరుసగా 8వ సంవత్సరం భారతదేశానికి ఈ షాపింగ్ కార్యక్రమం తిరిగి తీసుకురావడం పట్ల మేము సంతోషిస్తున్నాము. ఈ రెండు రోజుల కార్యక్రమం లో, విక్రేతలు తమ ఉత్పత్తులు మరియు బ్రాండ్‌ల దృశ్యమానతను పెంచడమే కాకుండా, 100 శాతం సేవలందించే పిన్ కోడ్‌లను విస్తరించి, భారతదేశం అంతటా అమెజాన్ యొక్క విస్తృతమైన కస్టమర్ బేస్‌ను నేరుగా చేరుకుంటారు. ఈ తరహా షాపింగ్ ఈవెంట్‌ల ద్వారా, చిన్న మరియు మధ్యతరహా వ్యాపారాలు ఇ-కామర్స్ శక్తిని స్వీకరించడానికి మరియు తమ విజయానికి కొత్త మార్గాలను తెరువడానికి, భారతదేశం యొక్క పెద్ద ఆర్థిక వృద్ధికి దోహదపడే శక్తివంతమైన ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌ను ప్రోత్సహించడం మా లక్ష్యం, "అని అమెజాన్ ఇండియా , సెల్లింగ్ పార్టనర్ సర్వీసెస్,డైరెక్టర్ అమిత్ నందా అన్నారు.

# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై నిష్ణాతులతో కార్మికులలో అవగాహన, చైతన్యాన్ని కలిగించి, వారితో సరియైన పోరాటాలను నిర్మించి పోరాడటం ద్వారానే సమస్యకు పరిష్కారం సాధ్యమని స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో "సంక్షోభంలో విశాఖ ఉక్కు-పరిష్కారం ఎలా" అనే సదస్సును నిర్వహిస్తున్న సందర్భంగా సదస్సు యొక్క గోడ ప్రతులను స్టీల్ ప్లాంట్‌లోని స్టోర్ జంక్షన్ వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కలిగిన సంక్షోభాలను ఎదుర్కోవడంలో స్టీల్ సిఐటియు ప్రధాన భూమిక పోషించిందని ఆయన అన్నారు. సమస్యల పరిష్కారం కొరకు నిష్ణాతులచే కార్మికులలో అవగాహన కల్పిస్తూ వారితో కలసి చైతన్యంతో కూడిన పోరాటాలను చేస్తేనే వాటిపై విజయం సాధ్యమని ఆయన వివరించారు. గడచిన కొంత కాలంగా స్టీల్ ప్లాంట్‌కు మైన్స్ కేటాయించాలని పాదయాత్రలు, రక్తదానం తదితర కార్యక్రమాల ద్వారా చైతన్యాన్ని కలిగించిన ఘనత స్టీల్ సిఐటియుకు ఉందని ఆయన అన్నారు. నేడు స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యకు ప్రధాన కారణంగా దీనిని ప్రభుత్వ యాజమాన్యాలు గుర్తించాయని ఆయన వివరించారు. కనుక ఈ సమయంలో ఈ అంశంపై మరింత అవగాహనను చైతన్యాన్ని కలిగించాలనే ప్రధాన ఆశయంతో జరుగుతున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఈ సదస్సును ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయం ముందు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. దీనిలో ముఖ్య వక్తలుగా మాజీ స్టీల్ ప్లాంట్ సిఎండి శివసాగర్ రావు, అఖిల భారత సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జె డి లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ లలిత్ మిశ్రా, రాష్ట్ర సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ నర్సింగరావు పాల్గొననున్నారని తెలిపారు. నేడు స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వీరు సూచించే మార్గాలపై కార్మికులు అవగాహన కల్పించుకోని తద్వారా మన పోరాటాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించ గలుగుతామని ఆయన అన్నారు. ఈ సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, కె గంగాధర్, నీలకంఠం, కృష్ణమూర్తి, టి వి కె రాజు, శంకర్రావు, శ్రీనివాస్ రెడ్డి, వి మురళి, డిఎస్‌విఎస్ శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ముత్యాల నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు చేపట్టండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తోపాటు అతిసార వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ మరియు జీవీఎంసీ ఇన్ చార్జ్ కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్ నందు జీవీఎంసీ అదనపు కమిషనర్ (డెవలప్మెంట్) కె.ఎస్.విశ్వనాథన్ ఇతర ఉన్నతాధికారులతో కలసి సీజనల్ వ్యాధులు, స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో సీజనల్ వ్యాధులు, అతిసార వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, కాలువలలో, గెడ్డలలో పూడికల తొలగింపు మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మలేరియా, డెంగ్యూ వ్యాధులు నమోదు, వాటి నియంత్రణకు తీసుకున్న చర్యలు, ప్రజలలో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, నిత్యం దోమల నియంత్రణకు ఫాగింగు, స్ప్రేయింగు వాటిపై వివరాలను డి.ఎం.ఒ. తులసిని, ప్రధాన వైద్యాదికారి డా.నరేష్ కుమార్ ను అడిగి తెలుసుకొన్నారు. వర్షాకాలం లో దోమలు వృద్ధి చెందే అవకాశం వున్నందున, అలాగే దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలని, ప్రజలు ప్రతీ వారం డ్రైడే డ్రైడే పాటించేటట్లు అవగాహన కల్పించాలని, కాలువలలో, గెడ్డలులో పూడికులు తొలగించాలని, రోడ్ల పైన, ఖాళీ ప్రదేశాలలో వర్షపు నీరు నిలవ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఇంటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డా.వి.సన్యాసి రావు, ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణ రాజు, పర్యవేక్షక ఇంజినీర్లు సాంసన్ రాజు, వేణుగోపాల్ రావు, కె.వి.ఎన్.రవి, వినయకుమార్, పి.వి.వి.సత్యనారాయణరాజు, అందరు ఎ.ఎం.ఒ.హెచ్ లు, బయోలజిస్ట్ సాంబమూర్తి, మలేరియా ఇన్ స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# కెనరా రోబెకో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్'ను విడుదల చేసిన కెనరా రోబెకో

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశపు రెండవ పురాతన అసెట్ మేనేజర్ కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్, మార్కెట్లు బాగా పనిచేసినప్పుడు ఆల్ఫాను ఉత్పత్తి చేయడానికి మరియు ప్రతికూల పరిస్థితులలో నష్టాలను తగ్గించడానికి ఉద్దేశించిన ఓపెన్-ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్ అయిన కెనరా రోబెకో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ ఎన్ఎఫ్ఓ జూలై 12, 2024న తెరవబడింది. జూలై 26, 2024న మూసివేయబడుతుంది. ఈక్విటీలలో 65 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఫండ్ యొక్క స్థూల కేటాయింపు ఉంటుంది. "కెనరా రోబెకో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఈక్విటీలు మరియు డెట్‌లకు ఎక్స్‌పోజర్‌ను శక్తివంతంగా మారుస్తుంది, ఇది ఆదాయ ఉత్పత్తితో దీర్ఘకాలిక మూలధన వృద్ధి లక్ష్యంగా చేసుకుంటుంది. సంభావ్య నష్టాలను తగ్గించుకుంటూ మార్కెట్ ర్యాలీలలో తమ భాగస్వామ్యాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తున్న పెట్టుబడిదారులకు ఇది అనుకూలంగా ఉంటుంది " అని కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్ సీఈఓ రజనీష్ నరులా అన్నారు. "కెనరా రోబెకో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ అనేది ఆస్తి కేటాయింపు ఉత్పత్తి, ఈ ప్రొప్రైటరీ మోడల్ వివిధ మార్కెట్ పరిస్థితులలో అసెట్ అలోకేషన్ ఫార్ములాలను సెట్ చేయడానికి ట్రెయిలింగ్ పీ/బీ, 'ఈక్విటీ రిస్క్ ప్రీమియం' మరియు 'ఫార్వర్డ్ పీ/ఈ'లను ఉపయోగిస్తుంది "అని కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్ ఈక్విటీస్ హెడ్ దత్త భండ్వాల్దార్ అన్నారు.